సాక్షి రంగారెడ్డి
శుక్రవారం । 30 । జూన్ । 2023



దేవుడా.. ఎన్నాళ్లీ విచారణ!

ఇంజాపూర్ రెవెన్యూలోని బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయ భూములపై విజిలెన్స్ విచారణ కొనసాగుతూనే ఉంది. 8లో▸



కారులోనే శాశ్వత నిద్రలోకి..

కారులో నిద్రిస్తున్న ఓ వ్యక్తి ప్రాణాలు వదిలిన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. 8లో▸

రేపు ఓయూలో సదస్సు

లాలాపేట: ఓయూ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం ఆర్గానో కెటాలసిస్ ప్రాస్పెక్ట్స్ అండ్ అపార్చునిటీస్ అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు జరిగే సెమినార్ ప్రారంభోత్సవంలో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కర్ణాటక వీసీ ప్రొ భట్టు సత్యనారాయణ, టీఎస్‌టీ–ఇండియా సెక్రటరీ డా.ఎస్.చంద్రశేఖర్ పాల్గొననున్నారు.

న్యూస్‌రీల్

స్విమ్మింగ్ పూల్‌లో విద్యార్థి మృతి



ఆనంద్ మృతదేహం

మొయినాబాద్: తోటి విద్యార్థులతో కలిసి గెట్ టు గెదర్ పార్టీ జరుపుకొనేందుకు ఫాంహౌస్‌కు వచ్చిన విద్యార్థి స్విమ్మింగ్ పూల్‌లో స్పృహ తప్పి మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన మండల పరిధిలోని సురంగల్ రెవెన్యూలో ఉన్న ఓ ఫాంహౌస్‌లో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ డీకే లక్ష్మీరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నంలోని శ్రీదత్త ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ 4వ సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులు 18 మంది బుధవారం రాత్రి సురంగల్ రెవెన్యూలో ఉన్న ఓ ఫాంహౌస్‌లో గెట్ టు గెదర్ పార్టీ జరుపుకొన్నారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో విద్యార్థులు స్విమ్మింగ్ చేస్తుండగా సరూర్‌నగర్ మండలం బాలాపూర్‌కు చెందిన చిట్టి ఆనంద్ (21) స్విమ్మింగ్ పూల్‌లోనే స్పృహకోల్పోయాడు. గమనించిన తోటి విద్యార్థులు వెంటనే అతన్ని నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆనంద్ మృతి చెందినట్లు చెప్పారు. సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ. 20 కోట్లతో ఓయూలో గిరిజన హాస్టళ్లు

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీలో గిరిజన విద్యార్థుల వసతి గృహాల నిర్మాణానికి గిరిజన సంక్షేమ శాఖ రూ. 20 కోట్లు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు ఇటీవల ఓయూతో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఓయూ రిజిస్ట్రార్ ప్రొ లక్ష్మీనారాయణ, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డా. క్రిష్టినా జెడ్ చోంగ్తు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు గురువారం ఓయూ అధికారులకు అందాయి. గిరిజన విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన ఉన్నత విద్యను అందించాలనే ఉద్దేశంతో ఈ ఒప్పందం చేసుకున్నట్లు ఓయూ అధికారులు పేర్కొన్నారు. ఈ నిధుల్లో రూ. 10 కోట్లతో 300 మంది విద్యార్థులకు, రూ 10 కోట్లతో మరో 300 మంది విద్యార్థినులకు వేర్వేరుగా రెండు వసతి గృహాలు నిర్మించనున్నారు. ఇందుకోసం క్యాంపస్‌లో ఎకరం చొప్పున స్థలాన్ని కేటాయించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోనే హాస్టళ్లను నిర్మించి ఓయూకు అప్పగిస్తారు.

మదర్ డెయిరీ అభివృద్ధికి సహకరిస్తాం

మంత్రి జగదీశ్వర్‌రెడ్డి



నూతన బాయిలర్, కోల్డ్ స్టోరేజ్, పెరుగు ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి

మన్సూరాబాద్: నార్మూల్ మదర్‌డెయిరీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్‌లోని నార్మూల్ మదర్‌డెయిరీ సంస్థ కార్యాలయంలో రూ. 3 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన నూతన బాయిలర్, కోల్డ్ స్టోరేజ్, విస్తరించిన పెరుగు ప్లాంట్‌ను, విజయ నూతన బ్రాండ్ పాల ప్యాకెట్‌ను సంస్థ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డితో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పాడి రైతుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వినియోగదారులకు నాణ్యమైన పాలను సరఫరా చేసి వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. సంస్థ మనుగడలో ఉద్యోగుల పాత్ర కీలకమని, ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బి.కృష్ణ, డైరెక్టర్లు అరుగాల గాల్‌రెడ్డి, దొంతిరి సోమిరెడ్డి, కర్నాటి జయశ్రీ, చింతలపురి వెంకటరామిరెడ్డి, చల్లా సురేందర్‌రెడ్డి, రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి, కోట్ల జలేందర్‌రెడ్డి, కందాల అలివేలు, గూడూరు శ్రీధర్‌రెడ్డి, గొల్లపల్లి రాంరెడ్డి, మందడి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలస్యంగా మెట్రో

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీసీ క్రాస్ రోడ్ వద్ద స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనుల కారణంగా జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్‌కు వెళ్లే మార్గంలో మెట్రో రాకపోకల్లో మార్పులు చేసినట్లు ఎల్‌అండ్‌ టీ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జులై 1 నుంచి 16వరకు ఉదయం 6 గంటలకు బయలుదేరాల్సిన మెట్రో అరగంట ఆలస్యంగా.. అంటే 6.30 గంటలకు బయలుదేరనుంది. మారిన వేళల ప్రకారం ఉదయం 6.30 నుంచి రాత్రి 11 గంటల వరకు మెట్రో రైళ్లు నడుస్తాయి.



ఆమనగల్లు: ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తి పారవశ్యం

ఒకే రోజు రెండు పండుగలతో జిల్లాలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. గురువారం అటు బక్రీద్ సందర్భంగా ఈద్గాలు, మసీదుల్లో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం ఒకరికొకరు ఈద్ ముబారక్ తెలుపుకొన్నారు. ఇటు తొలి ఏకాదశిని పురస్కరించుకుని దేవాలయాల్లో వేకువజాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ఆలయాలకు భక్తులు క్యూ కట్టారు.



షాద్‌నగర్: వేంకటేశ్వర స్వామి దేవాలయంలో క్యూ కట్టిన భక్తులు

ఈ-సిటీ సిగలో కొత్త నగ



రాబోతున్న మరో దిగ్గజ కంపెనీ

- రూ.225 కోట్ల పెట్టుబడితో టీసీఎల్
- నెలకొల్పనున్న కొత్త యూనిట్
- 500 మందికి ఉపాధి అవకాశాలు
- మారనున్న రావిర్యాల రూపురేఖలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఇప్పటికే పలు దిగ్గజ కంపెనీలు కొలువు దీరిన ఈ -సిటీ సిగలో మరో కొత్త నగ చేరబోతోంది. కన్స్యూమర్ ప్రొడక్ట్ రంగంలో విస్తృత ఉత్పత్తుల శ్రేణి కలిగిన టీసీఎల్ ఎలక్ట్రానిక్స్ సంస్థ రూ.225 కోట్ల అంచనా వ్యయంతో జిల్లాలో కొత్త యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు రెండు రోజుల క్రితం ఆ సంస్థ ప్రతినిధులు, రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సంస్థతో ప్రత్యక్షంగా 500 మందికి.. పరోక్షంగా మరికొంత మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది. ఈ సంస్థ తన ప్రధాన కేంద్రమైన చైనాలోని హె ఫెయి నగరం తర్వాత విదేశాల్లో ఏర్పాటు చేస్తున్న తొలి తయారీ యూనిట్ ఇదే కావడం విశేషం. తొలుత వాషింగ్ మిషన్లు తయారు చేసేందుకు ఉద్దేశించిన ఈ తయారీ కేంద్రం త్వరలోనే రిఫ్రిజిరేటర్లు, డిష్ వాషర్లను ఉత్పత్తి చేయనుంది. ఇప్పటికే కొంగర వేదికగా రూ.3,500 కోట్ల పెట్టుబడితో 196 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు కాబోతున్న ఫాక్స్‌కాన్ కంపెనీతో రావిర్యాల సహా ఆ పరిసర ప్రాంతాల్లో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. తాజాగా ఇదే ప్రాంతానికి మరో అంతర్జాతీయ కంపెనీ తన యూనిట్‌ను నెలకొల్పేందుకు ముందుకు రావడంతో స్థానికులకు ఉపాధి అవకాశాలు దక్కడంతో పాటు భూముల ధరలు భారీగా పెరగనున్నాయి.

టీఎస్‌బీపాస్ వచ్చిన తర్వాత జిల్లాలో ఏర్పాటైన కంపెనీలు..

సంవత్సరం	కంపెనీలు	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉపాధి
2015-16	120	4,567.67	27,639
2016-17	118	449.54	48,134
2017-18	202	7,688.92	30,645
2018-19	238	9,059.22	14,675
2019-20	130	4,948.31	1,84,539
2020-21	72	2,740.61	12,965
2021-22	180	6,851.51	22,341
2022-23	111	4,225.10	17,534

జిల్లాకు పెట్టుబడుల వెల్లువ

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానాన్ని తీసుకొచ్చింది. పెట్టు బడిదారులను ఆకర్షించేందుకు పలు రాయితీలను ప్రకటించింది. తక్కువ ధరకే భూములు కేటాయించడంతో పాటు 24 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా, సత్వర అనుమతుల జారీ కోసం టీఎస్ ఐపాస్‌ను ప్రవేశపెట్టింది. 2015–16 ఆర్థిక సంవత్సరం నుంచి 2023 మార్చి వరకు 1,589 దరఖాస్తులు టీఎస్ ఐపాస్‌కు అందగా, వీటిలో ఇప్పటి వరకు 1,171 పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. రూ. 77,320 కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టాలనే లక్ష్యంతో ఆయా కంపెనీలు దరఖాస్తు చేసుకోగా, ఇప్పటి వరకు రూ.44,572.88 కోట్ల పెట్టుబడులు పెట్టాయి. 9,67,297 మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుని, ఇప్పటి వరకు 4,88,472 మందికి ఉపాధి అవకాశాలు కల్పించాయి.

ప్రముఖ కంపెనీలన్నీ ఆ చుట్టు పక్కలే..

తెలంగాణ దశాబ్ది వేడుకల సందర్భంగా ప్రభుత్వం గుర్తించిన ఉత్తమ పరిశ్రమలన్నీ దీనికి సమీపంలోనే ఉన్నాయి. ఆదిబట్ల సెజ్‌లోని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టం కంపెనీ 2000 మందికి ఉపాధి కల్పిస్తూ..అత్యధిక మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న సంస్థల్లో మొదటి స్థానంలో నిలిచింది. విప్రో పర్సనల్ కేర్ లిమిటెడ్ కంపెనీ 600 మంది స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించింది. రాధా రమణ ఎంప్లాయర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ (టీఐడీఈఏ) ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌లో మొదటి స్థానంలో నిలిచిన కంపెనీ కూడా దీనికి సమీపంలోనే ఉంది. మహేశ్వరంలోని హార్డ్ వేర్ పార్క్‌లోని ఎం– ప్యాడ్ ఇంజనీరింగ్ క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్ సహా నాదర్‌గుల్‌లోని లార్డ్‌వెన్ హాంగర్స్ కంపెనీలు కూడా ఇక్కడే ఉండటం గమనార్హం. భగవతి ప్రొడక్స్ సహా రూ. 200 కోట్ల పెట్టుబడితో రెనివేస్ సోలార్ ప్రైవేట్ ఇండియా లిమిటెడ్, రూ.334 కోట్లతో ప్రిమియర్ ఇంజనీర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేటు లిమిటెడ్, రూ.20 కోట్లతో రిడెంట్ అప్లికేషన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్, రూ.423 కోట్లతో చిర్‌పాల్ పాలిఫిలిం వంటి ప్రముఖ కంపెనీలన్నీ ఈ సిటికి సమీపంలోనే ఉన్నాయి.



కొనసాగుతున్న హైదరాబాద్‌-విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు

శర'వే'గంగా విస్తరణ

- కొనసాగుతున్న విజయవాడ జాతీయ రహదారి పనులు
- ఎల్‌బీనగర్ నుంచి దండుమల్కాపూర్ వరకు పూర్తి కానున్న నిర్మాణం
- పూర్తయితే సాఫీగా సాగనున్న ప్రయాణం

అబ్దుల్లాపూర్‌మెట్: కొన్నేళ్లుగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న విజయవాడ జాతీయ రహదారి విస్తరణకు మోక్షం కలిగింది. పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా విస్తరణ చేపట్టాలంటూ వస్తున్న ప్రతిపాదనలకు స్పందించిన కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు పచ్చజెండా ఊపడంతో కొన్ని రోజులుగా పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఎల్‌బీనగర్ నుంచి దండుమల్కాపూర్ వరకు 24 కిలోమీటర్ల మేర ఇరువైపులా మూడు లేన్ల చొప్పున రోడ్డు విస్తరణ చేపట్టేందుకు రూ.600కోట్లు మంజూరయ్యాయి. కోవిడ్, కాంట్రాక్టర్ల సమస్యతో కొంతకాలంగా జాప్యం జరుగుతూ వస్తున్న పనులు ప్రస్తుతం నిర్విరామంగా కొనసాగుతున్నాయి. రహదారి విస్తరణ పూర్తయితే చాలా వరకు ప్రమాదాలను నివారించవచ్చని భావిస్తున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ కూడలి మినహా ప్రస్తుతం హయత్‌నగర్ నుంచి దండుమల్కాపూర్ వరకు రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి.

రద్దీ ఉన్న ప్రాంతాల్లో ఫ్లై ఓవర్లు

నిత్యం రద్దీగా ఉండే విజయవాడ జాతీయ రహదారిపై చేపడుతున్న విస్తరణ పనుల్లో భాగంగా 8 ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వాహనాల రద్దీతో పాటు ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతాల్లోనే ఫ్లైఓవర్లు నిర్మించనున్నారు. ఎల్‌బీనగర్ నుంచి దండు మల్కాపూర్ వరకు చేపడుతున్న విస్తరణలో వనస్థలిపురం పనామా కూడలి వద్ద, హయత్‌నగర్‌లో కుంట్లూర్ రోడ్డు వద్ద, పెద్ద అంబర్‌పేటలో పసుమాముల రోడ్డు, కోహెడ రోడ్డు వద్ద, అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఘట్‌కేసర్ రోడ్డు, అనాజీపూర్‌రోడ్డు, ఇనాంగూడ, బాటసింగారం కూడళ్ల వద్ద మొత్తం 8 ఫ్లై ఓవర్లు నిర్మించనున్నారు.

నేడు జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి బంగారు బోనం



చార్మినార్: సప్త మాతృకల సప్త బంగారు బోనం పూజా కార్యక్రమాల్లో భాగంగా భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలే భాస్కర్ రాజ్ ఆధ్వర్యంలో మూడో బంగారు బోనాన్ని శుక్రవారం జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి సమర్పించనున్నారు. నగరంలోని ఏడు అమ్మవారి దేవాలయాలకు ఏడు బంగారు బోనాలతో పాటు పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న నిర్వాహకులు ఇప్పటికే మొదటి బోనాన్ని గోల్కొండ జగదాంబ అమ్మవారికి, రెండో బంగారు బోనాన్ని బల్కంపేట ఎల్లమ్మ తల్లికి సమర్పించారు. మూడో బంగారు బోనాన్ని శుక్రవారం మధ్యాహ్నం గౌలిపురా కోట మైసమ్మ దేవాలయం నుంచి బాజా భజంత్రీలతో బయలుదేరి పెద్దమ్మ తల్లి అమ్మవారి దేవాలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకోనున్నారు.

శోకసంద్రంలో గుర్రంగూడ



నివాళి అర్పిస్తున్న మంత్రులు కేటీఆర్, సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి తదితరులు

- సాయిచంద్ మృతితో విషాదం
- పార్థివ దేహాన్ని కడసారి చూసేందుకు బారులు తీరిన నేతలు
- అశ్రునయనాల మధ్య అంతిమ యాత్ర
- సాహెబ్‌నగర్ శ్మశానవాటికలో అంత్యక్రియలు

బడంగ్‌పేట్: తన గళంతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసి రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన పాలమూరు ముద్దుబిడ్డ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ అకాల మరణం యావత్ తెలంగాణ సమాజాన్ని శోక సంద్రంలో ముంచేసింది. మరణ వార్త తెలుసుకున్న వెంటనే బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని గుర్రంగూడకు ప్రజాప్రతినిధులు, ఉద్యమకారులు, తెలంగాణ కవులు, కళాకారులు, తోటి సహచరులు ఆయన ఇంటికి చేరుకుని పార్థివదేహానికి నివాళి అర్పించారు. తన గొంతుకతో తెలంగాణ సమాజాన్ని ఒక్కటి చేసిన సాయిచంద్‌ను కోల్పోవడం బాధాకరమని అన్నారు. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. స్థానికంగా విషాద ఛాయలు అలముకున్నాయి. పార్టీలకు అతీతంగా కడసారి చూసేందుకు ప్రజాప్రతినిధులు, కవులు, కళాకారులు, రచయితలు, అభిమానులు బారులు తీరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ప్రతిపక్ష నేతలు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. గుర్రంగూడ నుంచి సాహెబ్‌నగర్ శ్మశానవాటిక వరకు అశ్రునయనాల మధ్య అంతిమయాత్ర కొనసాగింది. అరుణోదయ కళాకారిణి విమలక్క, ప్రజా యుద్ధనౌక గద్దర్, గోరటి వెంకన్న, మధుప్రియ, రసమయి బాలకిషన్, మంగ్లీ తదితరులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఉద్యమ పాటలతో ఘనంగా నివాళి అర్పించారు.

ట్రిపుల్... ట్రబుల్!

పరిమితికి మించి ద్విచక్ర వాహనాలపై ప్రయాణం



- ఇదే ప్రధాన ప్రమాదహేతువుగా మారుతున్న వైనం
- సిటీలో చోటు చేసుకుంటున్న ప్రమాద ఘటనలు
- మృత్యువాత పడుతున్న వారిలో యువకులే అధికం
- దృష్టి సారించిన హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు
- ఈ ఏడాది ఇప్పటికే 73 వేల కేసులు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: పంజగుట్టలో ఉంటున్న వాసుదేవ్ సాహు, చిత్తరంజన్, రిలీఫ్ సాహు ప్రయాణిస్తున్న బైక్ సికింద్రాబాద్‌లోని క్లాక్ టవర్ చౌరస్తా నుంచి సంగీత్ చౌరస్తా వైపు వస్తూ అదుపుతప్పింది. విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో రిలీఫ్ చనిపోగా... మిగిలిన ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి.

- సంతోష్‌నగర్‌కు చెందిన గండికోట శివ తన స్నేహితులైన జగదీష్, శివలతో కలిసి ద్విచక్ర వాహనంపై బైరామల్‌గూడ బయలుదేరారు. కర్మన్‌ఘాట్ చౌరస్తా సమీపంలో వీళ్లు ప్రయాణిస్తున్న బైక్ అదుపుతప్పి స్కిడ్ అయింది. ఈ ప్రమాదంలో ముగ్గురూ కిందపడిపోగా ఆర్టీసీ బస్సు తలపై నుంచి వెళ్ళడంతో గండికోట శివ అక్కడికక్కడే చనిపోయాడు. మిగిలిన ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. కేవలం ఈ రెండు ఉదంతాల్లోనే కాదు రాజధానిలో నిత్యం పదుల సంఖ్యలో యువత ట్రిపుల్ రైడింగ్ చేస్తూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. 'టు వీలర్ ఫర్ టు ఓన్లీ'... అని మోటారు వాహన చట్టం స్పష్టం చేస్తున్న ఈ విషయం అందరికీ తెలిసిందే. అయినప్పటికీ ద్విచక్ర వాహనంపై ఇద్దరి కంటే ఎక్కువ మంది ప్రయాణించడం పరిపాటిగా మారింది.

వాహనం అదుపు చేయడం అసాధ్యం...

ప్రతి వాహనానికీ దాన్ని తయారు చేసే కంపెనీ కొన్ని ప్రమాణాలు నిర్దేశిస్తుంది. ఇందులో భాగంగానే టూ వీలర్‌ను కేవలం ఇద్దరు వినియోగించడానికి వీలుగానే రూపొందిస్తుంది. ముందు డ్రైవర్, వెనుక పిలియన్ రైడర్ మాత్రమే ప్రయాణించాలంటూ తమ నిబంధనల్లో స్పష్టం చేస్తుంది. దీనికి సాంకేతికంగానూ ప్రత్యేక కారణాలు ఉన్నాయి.

ఇంజిన్ కెపాసిటీ

మోటారు వాహనాలకు ఉండే ప్రతి ఇంజిన్‌కు ప్రత్యేక సామర్థ్యం ఉంటుంది. దీన్నే సాంకేతికంగా ఇంజిన్ కెపాసిటీ అంటారు. ఆ వాహనం ఎందరు ప్రయాణించడానికి అనువుగా రూపొందిస్తారో... అదే సామర్థ్యంలో ఇంజిన్ అభివృద్ధి చేస్తారు. నిర్దేశించిన ప్రయణికుల కంటే ఎక్కువ మంది ఆ వాహనంపై ప్రయాణిస్తే దాని ప్రభావం ఇంజిన్‌పై పడుతుంది.

యాక్సిలరేటింగ్ కెపాసిటీ

ఓ వాహనం ఎంత వేగంతో దూసుకుపోవాలనేది స్పష్టం చేసేదే యాక్సిలరేటింగ్ కెపాసిటీ. సదరు వాహనంపై పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కినప్పుడు ఈ కెపాసిటీ తగ్గుతుంది. సాధారణంగా గంటకు 60 కిమీ వేగంతో దూసుకుపోయే వాహనం ఇలాంటప్పుడు 40 కిమీ మించదు. ఈ ప్రభావం ఓవర్‌టేకింగ్ తదితర సమయాల్లో ప్రమాదాలకు కారణమవుతుంది.

బ్రేకింగ్/బ్యాలెన్సింగ్ కెపాసిటీ

ఏదైనా వాహనం ప్రమాదానికి లోనుకాకుండా ఉండాలంటే ఈ రెండూ అత్యంత కీలకం. సరైన సమయానికి బ్రేక్ వేయగలగటం, అవసరమైన స్థాయిలో బ్యాలెన్స్ చేసుకోవడం తప్పనిసరి. అయితే ట్రిపుల్ రైడింగ్ వంటివి చేసినప్పుడు ఈ ప్రభావం ఈ రెండు కెపాసిటీల పైనా పడి... ఎదురుగా ముప్పును గుర్తించినా తక్షణం స్పందించి వాహనాన్ని ఆపలేరు.

ట్రిపుల్ రైడింగ్ కేసులు ఇలా..

ఏడాది	కేసులు
2014	38,221
2016	33,450
2022	95,225
2023 (ఇప్పటికి)	73,525

త్వరలో చార్జ్‌షీట్స్ దాఖలు చేస్తాం

డ్రంక్ డ్రైవింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపటం, మైనర్ డ్రైవింగ్ మాదిరిగా ట్రిపుల్ రైడింగ్‌ను తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఇప్పటి వరకు రూ.1000 జరిమానా మాత్రమే విధిస్తున్నాం. త్వరలో కోర్టుల్లోనూ అభియోగపత్రాలు దాఖలు చేయనున్నాం. ఎందరో తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుస్తున్న ట్రిపుల్ రైడింగ్‌ను అదుపు చేయడానికి యువకుల తల్లిదండ్రులు, కుటుంబీకుల సహకారం కూడా ఎంతో అవసరం.

– ట్రాఫిక్ పోలీసులు

సాయిచంద్‌కు కన్నీటి వీడ్కోలు

ప్రముఖ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ పార్థివదేహాన్ని కడసారి చూసేందుకు ప్రముఖులు, అభిమానులు బారులు తీరారు. అంతిమయాత్రలో బీఎస్పీ అధ్యక్షుడు ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్, మల్లురవి, చెరుకు సుధాకర్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– బడంగ్‌పేట్





అంతిమయాత్రలో బీఎస్పీ అధ్యక్షుడు ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్, మల్లురవి, చెరుకు సుధాకర్ తదితరులు

కారులోనే శాశ్వత నిద్రలోకి..



కారులోనే మృతిచెందిన కృష్ణ

అబ్దుల్లాపూర్‌మెట్ : కారులో నిద్రిస్తున్న ఓ వ్యక్తి ప్రాణాలు వదిలిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తారమతిపేట గ్రామ గౌడ సంఘం శ్మశాన వాటిక పక్కనే నిలిపి ఉన్న కారులో ఓ వ్యక్తి మృతిచెంది ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు గురువారం పోలీసులు కారు తలుపులు తెరిచి పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. దీంతో మృతుడి వివరాల కోసం ఆరా తీయగా నాగర్ కర్నూలు జిల్లా ఉప్పునూతల మండలం మామిళ్లపల్లికి చెందిన కడారి కృష్ణ (30)గా గుర్తించారు. నాలుగేళ్ల క్రితం బతుకుదెరువు కోసం తారమతిపేట గ్రామానికి భార్య, ముగ్గురు పిల్లలతో వచ్చిన కృష్ణ తన సోదరుడికి చెందిన కారును అద్దెకు నడుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో కృష్ణ మద్యానికి బానిస కావడంతో ఆరోగ్యం పూర్తిగా దెబ్బతిన్నదని, బుధవారం రాత్రి ఇంటికి కూడా రాలేదని మృతుడి భార్య తెలిపారు. అనారోగ్యం కారణంగానే తన భర్త మృతిచెంది ఉండవచ్చని తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'విద్యాపరమైన ఆలోచనలే విధాన నిర్ణయాలు కావాలి'

లాలాపేట: విద్యాపరమైన ఆలోచనలను విధాన నిర్ణయాలకు దిశానిర్దేశం కావాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి అన్నారు. రెండు రోజులుగా ఓయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో కొనసాగుతున్న 'ఎమర్జింగ్ పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్' జాతీయ సెమినార్ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా బీఈడీ కోర్సుకు ఆదరణ తగ్గడంపై ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థ పటిష్టంగా ఉండాలంటే నాణ్యమైన ఉపాధ్యాయులను సిద్ధం చేసే బాధ్యత విశ్వవిద్యాలయ విద్యా విభాగానికి ఉందన్నారు. ఈ నేపథ్యంలో సమావేశంలో నూతన విద్యా విధానంపై విపులంగా చర్చించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఓయూ వీసీ రవీందర్, ప్రొఫెసర్లు రామకృష్ణ, మృణాళిని, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

దేవుడా.. ఎన్నాళ్లీ విచారణ!

బాలాజీ ఆలయ భూములకు దిక్కెవరు?

- 'సాక్షి' కథనంతో కదిలిన యంత్రాంగం
- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని ఎంక్వయిరీ
- పలుచోట్ల కబ్జా అయినట్లు గుర్తింపు
- అయినా చర్యలు శూన్యం



సర్వే నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

తుర్కయంజాల్: ఇంజాపూర్ రెవెన్యూలోని బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయ భూములపై విజిలెన్స్ విచారణ ఇంకా కొనసాగుతూనే ఉంది. ఏళ్లు గడుస్తున్నా విచారణ పూర్తి చేయకపోవడం గమనార్హం. 2020 జూలై 19న 'సాక్షి'లో దేవుడి ఆస్తులకే రక్షణ కరువు శీర్షికన కథనం ప్రచురితమైంది. అయితే యంత్రాంగం స్పందించిన కొనసాగిస్తున్న విచారణ ఏళ్లు గడుస్తున్న పూర్తి కావడంలేదు. దీంతో బాలాజీ వెంకటేశ్వర స్వామి భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కళ్లెదుటే కొన్ని సర్వే నంబర్లలో భూములు కబ్జాదారుల కబంధ హస్తాల్లో చిక్కుకుపోయినా కాలయాపన చేస్తున్నారే కానీ, వాటిని రక్షించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విజిలెన్స్ విచారణ ప్రారంభించాక మొదట్లోనే ఇరిగేషన్, రెవెన్యూ, ఎండోమెంట్ అధికారులు సంయుక్తంగా ఆలయ భూముల సర్వే నిర్వహించగా, ఆ తరువాత ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు డిప్యూటీ డైరెక్టర్ సర్వే నిర్వహించారు. విచారణలో భాగంగా ఈ నెల 14న విజిలెన్స్ అధికారుల బృందం ఆలయ భూములను పరిశీలించారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన నివేదికల ఆధారంగా వాటిపై ఆరాతీశారు.

సుమారు రూ.700 కోట్ల విలువ..

ఇంజాపూర్‌లోని పలు సర్వే నంబర్లలో రెవెన్యూ రికార్డుల ప్రకారం 68.18 ఎకరాల దేవాలయ భూములున్నాయి. దేవాదయ శాఖ రికార్డుల ప్రకారం 74.15 ఎకరాల భూమి నమోదై ఉంది. ఈ మొత్తం భూమి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ. 700 కోట్లకు పైమాటే. ఇంత ఖరీదైన భూములను కాపాడటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా నగరంలోని ఉప్పల్‌లో సర్వే నంబర్లు 801, 807, 808, 809లో రికార్డుల ప్రకారం 6.38 ఎకరాల భూమి ఉండేది. ఈభూమిని 1994 ఏప్రిల్ నెల 13న అప్పటి సింగిల్ ట్రస్ట్ ఈఓ రామశాస్త్రి, టెనెంట్ హక్కుదారు బజారు బుచ్చన్నకు ఎకరానికి రూ. లక్ష చొప్పున విక్రయించినట్లు సమాచారం. ఆలయం పేరు మీద బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారని తెలుస్తోంది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని పోచంపల్లి మండలం రేవనపల్లి ఈ ఆలయానికి సంబంధించిన భూములు ఉన్నట్లు సమచారం.

అధికారుల నివేదిక ప్రకారం..



వేంకటేశ్వర స్వామి దేవాలయం

సర్వే నంబర్లు 19, 21, 23లో 21 గుంటల్లో గోదాములు నిర్మించినట్లు, సర్వే నంబర్ 20లోని 2 ఎకరాల 31 గుంటల స్థలంలో అక్రమ పార్కింగ్ చేస్తున్నట్లు , సర్వే నంబర్ 130లోని శ్రీరంగాపురం కాలనీలో పలు ఇళ్ల నిర్మాణం నిర్మించినట్లు రెవెన్యూ, దేవాదయ శాఖ అధికారులకు ఇచ్చిన నివేదికల ఆధారంగా తెలుస్తోంది. అదేవిధంగా సర్వే నంబర్ 105లో పలువురు రైతులు వ్యవసాయం చేస్తున్నట్లు నివేదిక అందజేశారు. పలుచోట్ల అన్యాక్రాంతం అయినట్లు గుర్తించినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని భక్తులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి విజిలెన్స్ విచారణను పూర్తి చేసి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని, ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని భక్తులు కోరుతున్నారు.

వివరాలు వెల్లడించలేం

'సాక్షి'లో ప్రచురించిన దేవుడి ఆస్తులకు రక్షణేది కథనం ఆధారంగానే విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది. ఇటీవలనే విజిలెన్స్ అధికారుల బృందం, రెవెన్యూ అధికారులతో కలిసి ఆలయ భూములను పరిశీలించారు. విజిలెన్స్ విచారణ పూర్తయితేనే వివరాలు బయటకు వస్తాయి. అప్పటి వరకు వివరాలను వెల్లడించలేం.

– శ్రీనివాస్ రెడ్డి,
దేవాదాయ శాఖ అధికారి

స్టేషన్‌లో ఉండని ఎస్‌హెచ్‌ఓలపై కఠిన చర్యలు

- సమగ్ర నివేదికల తర్వాతే ఇన్‌స్పెక్టర్ల బదిలీలు
- మహిళల వేధింపుల కట్టడికి ప్రత్యేక వ్యూహం
- టోల్ ఫ్రీ నంబర్, కౌన్సెలింగ్ సెంటర్ల ఏర్పాటు
- ఒకట్రెండు రోజుల్లో నాగోల్ పీఎస్ ప్రారంభం
- కొత్త ఠాణాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు
- 'సాక్షి'తో రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్ వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: కొన్ని ఠాణాలలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) ప్రజలకు అందుబాటులో ఉండటం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని రాచకొండ పోలీసు కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ అన్నారు. ఎవరైనా బాధితులు స్టేషన్‌కు వస్తే ఫలానా సెక్టార్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ)ను కలవమనో, రిసెప్షన్‌లో సంప్రదించాలనో సూచిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వంద శాతం ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఎస్‌హెచ్‌ఓలకు సూచించారు. రాచకొండ పునర్ వ్యవస్థీకరణలో భాగంగా కొత్తగా ఐదు పీఎస్‌లను ఏర్పాటు చేశామని, వీటిలో ఇప్పటికే చర్లపల్లి, గ్రీన్ ఫార్మాసిటీ, పోచారం ఐటీ కారిడార్, ఉప్పల్ మహిళా పోలీసు స్టేషన్లు ఏర్పాటయ్యాయని, ఒకట్రెండు రోజుల్లో నాగోల్ ఠాణాను ప్రారంభించనున్నట్లు సీపీ చౌహాన్ 'సాక్షి'కి తెలిపారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే..

◆ కొత్త ఎస్ఐ, కానిస్టేబుళ్ల నియామకాలు జరగకపోవటంతో అందుబాటులో ఉన్న సిబ్బందితోనే కొత్త ఠాణాలను నిర్వహిస్తున్నాం. శాశ్వత భవనాలు లేకపోవటంతో స్టేషన్లను అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయి. కొత్త స్టేషన్ల గురించి ప్రజలకు తెలిసేలా సెక్టార్ ఎస్ఐలు, కానిస్టేబుళ్లు బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ వాహనాలతో గల్లీ గల్లీ తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఠాణా పరిధి, ఎస్‌హెచ్‌ఓ, సెక్టార్ ఎస్ఐల ఫోన్ నంబర్లు ప్రజలకు తెలిసేలా సూచికలు ఏర్పాటు చేశాం. ఇన్‌స్పెక్టర్ల బదిలీలలో ఎవరి ప్రమేయం, ఒత్తిడి లేదని, సంబంధిత అధికారులపై సమగ్ర నివేదికల అధ్యయనం తర్వాతే బదిలీలు చేస్తున్నాం.

◆ రోడ్ల మీదే కాదు ఆన్‌లైన్‌లోనూ విద్యార్థినులు, మహిళలను వేధించడం ఆగడం లేదు. ఆఫ్‌లైన్‌లో కంటే ఆన్‌లైన్‌లో మహిళలను వేధించడం బాగా పెరిగిపోయింది. ఎక్కువగా టీనేజ్ అమ్మాయిలు ఈ తరహా వేధింపుల బారిన పడుతున్నారు. ఆకతాయిలకు ఇదొక వ్యాధిలాగా ముదిరిపోయింది. మహిళల ఫొటోలు తీసి వాటిని అసభ్యకరంగా చిత్రీకరించి సోషల్ మీడియాలో పెడతామంటూ బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. గత రెండు నెలల్లో ఈ తరహా కేసులు 30 వరకు నమోదు కాగా.. వీటిల్లో 20 కేసులలో నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించాం. ఆన్‌లైన్ వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తున్నాం. లఘు చిత్రాలతో సామాజిక మాధ్యమాలలో పోస్టులతో ప్రచారం కల్పిస్తున్నాం. 87126 62662 కాల్ సెంటర్‌తో పాటు కౌన్సిలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం.

◆ లోన్ యాప్ కేసులు, చైన్ స్నాచింగ్‌లు పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. కేసుల నమోదు, నిందితులతో అరెస్టులతో పాటు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇప్పటివరకు సుమారు 50కి పైగా విద్యా సంస్థలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. ప్రతి వారం రెండు కాలేజీలలో సైబర్ నేరాలపై ప్రోగ్రామ్‌లను చేస్తున్నాం.

ఆగస్టు 26 నుంచి జాతీయ నృత్య, సంగీత పోటీలు

కేవీ రమణా చారిచే పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి తదితరులు

నాంపల్లి: ప్రముఖ సాంస్కృతిక సంస్థ నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో 48వ జాతీయ స్థాయి శాస్త్రీయ నృత్య, సంగీత పోటీలను ఆగస్టు 26 నుంచి వారం రోజుల పాటు హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, సమన్వయకర్త నిష్టల సుధామాల తెలిపారు. ఉత్తర, దక్షిణ సంగీత నృత్యరీతులు–హిందుస్తానీ సంగీతం(గాత్రం, సితార్, తబలా) కర్ణాటక సంగీతం (గాత్రం, వీణ, వయోలిన్, మృదంగం)తో పాటుగా కూచిపూడి, కథక్, భరతనాట్యం తదితర విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు గురువారం మాసబ్‌ట్యాంక్‌లోని నఫీజ్ రెసిడెన్సీలోని డాక్టర్ కేవీ రమణాచారి క్యాంప్ కార్యాలయంలో పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే శాస్త్రీయ సంగీత నృత్య రీతుల్లో జాతీయ స్థాయి పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఔత్సాహిక యువ కళాకారులను ప్రోత్సహిస్తున్న నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమం విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. గౌరవ అతిథిగా హాజరైన రాష్ట్ర ఖజానా, గణాంకాల శాఖ ఉప సంచాలకులు జి.వసుంధర మాట్లాడుతూ... ఈ పోటీలు జాతీయ సమైక్యతకు దోహదపడుతాయన్నారు. కరార్యక్రమంలో సమితి కార్యనిర్వాహక సంఘం సభ్యులు ఎ.రజిత్, రాజ్‌కుమార్, నృత్య గురువులు వై.చలపతి శాస్త్రి, గీతా గణేశన్, డాక్టర్ ఇందిరాహేమ, వాణీ రమణ,శ్రీలత నాపరాజు, సంగీత కళాకారులు వాసా గోపీనాథరావు, డాక్టర్ అస్మితా మిశ్రా, వి.దుర్గారావు, హరనాథ బాబు, కె.చక్రపాణి పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో దరఖాస్తులు...

ఈ పోటీలను వయస్సు ఆధారంగా నిర్వహిస్తున్నారు. సీనియర్లు (17 నుంచి 23 సంవత్సరాలు), జూనియర్లు (13 నుంచి 16 సంవత్సరాలు), సబ్ జూనియర్లు (8 నుంచి 12 సంవత్సరాలు) గా విభజించారు. నృత్య పోటీలు తెలంగాణ సారస్వత పరిషత్‌లో, శ్రీ కృష్ణదేవరాయ భాషా నిలయంలో సంగీతం పోటీలు జరుగుతాయని విజయకుమార్ తెలిపారు. ఔత్సాహిక కళాకారులు నారాయణగూడలోని వైఎంసీఏ కార్యాలయం నుంచి సిలబస్, దరఖాస్తు ఫారాలను పొందవచ్చును. దరఖాస్తు ఫారాలను ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా అందజేయవచ్చునన్నారు. ఇతర వివరాలకు 9908625949 లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవ్యనాటకసమితి.ఓఆర్‌జి వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

వస్త్రధారణ నచ్చలేదంటూ హేళన..

హిమాయత్‌నగర్: ఫొటోగ్రఫీ నేర్చుకునేందుకు ఓ ప్రముఖ శిక్షణ సంస్థకు వెళ్లిన వైద్యురాలికి చేదు అనుభవం ఎదురైంది. ఇనిస్టిట్యూట్ నిర్వాహకుడు ఆమె ధరిస్తున్న వస్త్రాలు నచ్చలేదంటూ, తాము చెప్పినట్లే ఉండాలంటూ ఆదేశించాడు. విద్యార్థుల ఎదుటే ఆమె ఒంటిపై దుప్పట(చున్నీ)ని తొలగించేలా చేసి హేళన చేశారంటూ బాధితురాలు నారాయణగూడ పోలీసులను ఆశ్రయించింది. కొద్దిరోజులుగా శారీరకంగా, మానసికంగా వేధిస్తున్న సదరు ఇనిస్టిట్యూట్ యజమానిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ వైద్యురాలు హిమాయత్‌నగర్‌లోని 'ఐస్‌పీ' అనే ఫొటోగ్రఫీ ఇనిస్టిట్యూట్‌లో 6 నెలల పాటు కోచింగ్ నిమిత్తం చేరింది. ఇనిస్టిట్యూట్‌లో జాయిన్ అయినప్పటి నుంచి వైద్యురాలి వస్త్రధారణ యజమాని సత్యంకు నచ్చడం లేదు. ఇటీవల ఆమె ధరించిన వస్త్రాలపై ఉన్న దుపట్టా(చున్నీ)ని తొలగించాలంటూ స్టూడెంట్స్ ఎదుట అతను బలవంతం చేశాడు. ఇనిస్టిట్యూట్ విద్యార్థులు చాలా స్టైలిష్‌గా ఉండాలని సూచించాడు. ఇనిస్టిట్యూట్‌లో స్టూడెంట్స్ అందరూ మగవారు కావడంతో ఆమె నిరాకరించింది. ఈ క్రమంలో దుపట్టా తొలగించకపోతే ఇనిస్టిట్యూట్ నుంచి సస్పెండ్ చేస్తానంటూ బెదిరించాడు. ఆమె దుపట్టను తొలగించింది. ఆ తర్వాత ఆమె పర్సనల్ ఫోన్ నంబర్లను యజమాని సత్యం ఇనిస్టిట్యూట్ విద్యార్థులకు ఇచ్చాడు. వారు ఆమెకు తెలియకుండా ఫొటోలు, వీడియోలను షూట్ చేసి ఇన్‌స్టాగామ్ పేజీల్లో పోస్ట్ చేశారు. దీనిపై సత్యంను నిలదీయగా వారే డిలీట్ చేస్తారంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. దీంతో వారం క్రితం వైద్యురాలు తన సోదరితో కలిసి ఇనిస్టిట్యూట్‌కు వెళ్లి వీడియోలు, ఫొటోలు తొలగించాలని కోరింది. ఈ క్రమంలో సత్యంతో పాటు మణికంఠ, సాయికిరణ్ అనే వ్యక్తులు వైద్యురాలి సోదరి పట్ల దురుసుగా ప్రవర్తించారు. స్టూడెంట్స్ అందరూ చూస్తుండగా వైద్యురాలి సోదరిని కొట్టి బయటికి గెంటివేశారు. తనను వేధిస్తున్న సత్యం, అందుకు సహకరిస్తున్న మణికంఠ, సాయికిరణ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన నారాయణగూడ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గ్యాస్ లీకై 15 మందికి అస్వస్థత

సనత్‌నగర్: భూమిలో కూరుకుపోయి శిథిలమైన అమోనియా గ్యాస్ సిలిండర్లకు ఉన్న వాల్వ్‌లు తొలగించే ప్రయత్నంలో గ్యాస్ లీకై 15 మంది అస్వస్థతకు గురయ్యారు. ఓ వ్యక్తి గ్యాస్ సిలిండర్ల వాల్వ్‌ల చోరీకి యత్నించిన క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఫతేనగర్‌లోని పైప్‌లైన్ రోడ్డు చివరన ఉన్న నాలాను ఆనుకుని చెత్త కుప్పల్లో గ్యాస్ కటింగ్‌కు ఉపయోగించే రెండు గ్యాస్ సిలిండర్లు భూమిలో కూరుకుపోయి ఉన్నాయి. గురువారం సాయంత్రం అటుగా వెళుతున్న వడ్డెర బస్తీకి చెందిన వ్యక్తి వాటిని గుర్తించాడు. గ్యాస్ సిలిండర్లకు ఉన్న ఇత్తడి వాల్వ్‌లు తీసుకునేందుకు ఓ సిలిండర్ వాల్వ్‌ను రాడ్‌తో కొట్టడంతో ఒక్కసారిగా నుంచి గ్యాస్ లీకైంది. దీంతో పక్కనే ఉన్న మెకన్ టెక్నాలజీ కంపెనీలో పనిచేస్తున్న బీహార్‌కు చెందిన 10 మంది కార్మికులు ఊపిరాడక అస్వస్థతకు గురయ్యారు. అదే ప్రాంతానికి చెందిన మరో ఐదుగురు అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు వారిని సమీపంలోని బీబీఆర్ ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి మెరుగ్గానే ఉందని, కోలుకుంటున్నట్లు ఇన్‌స్పెక్టర్ ముత్తుయాదవ్ తెలిపారు.



లీకేజీకి కారణమైన గ్యాస్ సిలిండర్లు ఇవే..